క్లుప్తంగా

మద్యం దుకాణాలకు 861 దరఖాస్తులు



మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి నగరంలోని 19 మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రికి 861 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు తెలిపారు. ప్రభుత్వానికి రూ.17.22 కోట్ల ఆదాయం సమకూరినట్లు చెప్పారు. ఈ నెల 14న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాడికొండ: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం బడేపురం గ్రామంలోని అమ్మవారికి సీఐ కె.వాసు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాములపాడు గ్రామంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.

నిబద్ధతతో పని చేయాలి

తెనాలిరూరల్: ఏ సంస్థలో పనిచేసినా ఆ సంస్థ సమష్టి ప్రయోజనం కోసం నిబద్ధతతో పనిచేస్తే యాజమాన్యంతో పాటు ఉద్యోగులకు మంచి భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్ ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌లో శుక్రవారం దసరా వేడుకలను పురస్కరించుకుని సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకురాలు మంచికలపూడి సరోజిని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళల ఉపాధి కోసం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.



శివాలయంలో మహిషాసుర మర్దనిగా..



ఉండవల్లి రెడ్డ రామమందిరంలో కుంకుమ పూజ



కంఠంరాజు కొండూరులో..



పెనుమాక దాసులవారి పాలెంలో..



విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై..



విజయకీలాద్రిపై అభిషేకం



మహిషాసుర మర్దనిగా.. మూలాంకురేశ్వరి



వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి



ఫిరంగిపురంలోని విజయదుర్గా మాత

మహిషాసురమర్దని.. పాహిమాం

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమివ్వగా పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– మంగళగిరి/తాడేపల్లి రూరల్



మంగళగిరి: మహిషాసుర మర్దనిగా.. కాళీమాత



మంగళగిరి: కనకదుర్గమ్మ..



ధైర్యలక్ష్మిగా రాజ్యలక్ష్మీ అమ్మవారు

కార్మికులకు రూ.21 వేల వేతనం డిమాండ్

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి

తాడేపల్లిరూరల్ : పారిశుద్ధ్య కార్మికులకు మార్చి 1న ఇచ్చిన జీవో ప్రకారం రూ.21 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డేశ్వరం జాతీయరహదారి వద్ద ఉన్న కేబీఎస్ భవన్‌లో పారిశుద్ధ్య కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ధనలక్ష్మి మాట్లాడుతూ తాడేపల్లి రూరల్ పరిధిలోని 8 గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. సంఘనాయకులు గతంలో మున్సిపల్ అధికారులను కలిసినపుడు మార్చి 1 నుంచి రూ. 21 వేలు వేతనం ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ సెప్టెంబరు నెల నుంచి మాత్రమే వేతనం ఇస్తున్నారని చెప్పారు. మార్చి నుండి ఆగష్టు వరకు ఆరు నెలల హెల్త్ అలవెన్స్ ఒక్కో నెలకు రూ.6 వేలు మున్సిపల్ కార్మికులకు బకాయి రావాల్సి ఉందని వివరించారు. మున్సిపల్ వర్కర్ల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి, నెలకు రూ.21 వేల వేతనం అందేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి అధ్యక్షుడు చౌక్కా మరియదాసు, సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మేకల డేవిడ్, పల్లె కృష్ణ, విజయరాజు, కె. క్రాంతికుమార్, సరోజిని, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నూతన ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలి

తాడేపల్లిరూరల్ : ఎన్నికల వాగ్దానంలో భాగంగా కూటమి ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కుంచనపల్లిలో సీపీఎం మహా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులు సరైన ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధిక వర్షాలు, వరద ముంపు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. అనంతరం పార్టీ కుంచనపల్లి ఒకటవ శాఖ కార్యదర్శిగా అమ్మిశెట్టి రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, సీనియర్ నాయకులు అమ్మిశెట్టి సాంబయ్య, నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పాశం రామారావు

బ్యాటరీల చోరీ



ఖాళీగా ఉన్న బ్యాటరీ కేస్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మళ్లీ బ్యాటరీ చోరీలు ప్రారంభమయ్యాయి. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున ఉండవల్లి అమరావతి రోడ్డులో సాయిబాబా గుడివద్ద నిలిపి ఉన్న రెండు లారీల్లో గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు బ్యాటరీలు చోరీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లి సాయిబాబా గుడి వద్ద నివాసముండే భాస్కర్, రవి అన్నదమ్ములకు రెండు ఇసుక లారీలున్నాయి. ఇసుక తోలకాలు లేకపోవడంతో అమరావతి రోడ్డు వెంబడి పార్క్ చేశారు. తెల్లవారుజామున బ్యాటరీ కేస్ తాళాలు పగలకొట్టి నాలుగు బ్యాటరీలు, బ్యాటరీకి ఇంజన్‌కు ఏర్పాటు చేసే కాపర్ వైర్లను దొంగిలించారు. వాటి విలువ రూ.50 వేలు ఉంటుందని, ఈ ఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భాస్కర్ తెలిపారు.

14న పల్లె పండుగ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 14 నుంచి పల్లె పండుగను ప్రణాళికతో సిబ్బంది నిర్వహించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ నెల 30 వరకు నిర్వహించే కార్యక్రమాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

తాడికొండ: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరును శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కియా షోరూమ్ ప్రారంభించిన మంత్రి లోకేష్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

తాడేపల్లిరూరల్: కొలనుకొండ జాతీయ రహదారి వెంబడి నూతనంగా ఏర్పాటు చేసిన కియా కార్ షోరూమ్‌ను శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇతర మంత్రులు ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డి, కొలుసు పార్థసారథితో కలసి ప్రారంభించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ కియా కార్ల ఫ్యాక్టరీ ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం అందరికీ గర్వకారణమన్నారు. సింహా కియా డైరెక్టర్లు రావెళ్ల సుబ్బయ్య, సతీష్ మాట్లాడుతూ 2019లో తమ మొదటి కియా షోరూమ్‌ను విజయవాడలో ప్రారంభించామని, అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో కొలనుకొండలో విశాలమైన ప్రాంగణంలో షోరూమ్‌ను ప్రారంభించామని తెలిపారు. కియా కార్ల పూర్తిశ్రేణి విక్రయాలతో పాటు, ఆధునిక పరికరాలతో రోజుకు 50 కార్ల వరకు సర్వీస్ అందించగల సామర్థ్యం కలిగి ఉందని వెల్లడించారు. కియా కంపెనీ సౌత్ ఇండియా రీజినల్ మేనేజర్ జోంగో ర్యూ, రావెళ్ల నందన్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజంలో హక్కుల సాధన



అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది, చిన్నారులు

తాడికొండ: బాలికలకు లింగ వివక్ష లేకుండా సమాజంలోని సంపూర్ణ హక్కులు అందించాల్సిన అవసరం అందరిపై ఉందని లాం కృషి విజ్ఞాన కేంద్రం న్యూట్రిషన్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప పేర్కొన్నారు. శుక్రవారం రావెల, పొన్నెకల్లు, పాములపాడు, గరికపాడు, దామరపల్లి, బేజాత్‌పురం, ఫనిదరం, లచ్చన్న గుడిపూడి గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహారం తయారీని వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు సీహెచ్ కళావతి, ఎం.శ్రీదేవి మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో ప్రతి ఒక్కరు బాలికల ఆలోచనలు, అభిప్రాయాలను తీసుకొని దానికి అనుగుణంగా వారి అభివృద్ధి ప్రణాళికలు రచించాలన్నారు. క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, సిబ్బంది జయరాజు, సౌభాగ్యం, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 552 టెండర్లు

తెనాలిరూరల్: నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు మద్యం దుకాణాలకు తెనాలిలో పెద్ద ఎత్తున టెండర్లు వచ్చాయి. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో 25 షాపులను ఏర్పాటు చేయనున్నారు. వీటికి శుక్రవారం రాత్రి 9.30 వరకు 552 టెండర్లు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు. తెనాలి పట్టణంలోని ఒక షాపు, కొల్లిపరలోని మరో షాపుకు అత్యధికంగా 26 చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా పట్టణంలోని ఓ షాపుకు 19 టెండర్లు వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.











